

# సూర్య

నేటి దినపత్రిక
www.suryaa.com

## నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం 20 జనవరి 2025 5 పేజీలు



- కాంగ్రెస్ టికెట్ కోసం ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి... ప్రసన్న హరికృష్ణ
- పోటా పోటీగా కాంగ్రెస్ నాయకులను కలుస్తున్న తీరు
- టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు. .
- ఇద్దరినీ వదులుకోలేకపోతున్న పార్టీ
- ఒకరు టీచర్స్, మరొకరు పట్టభద్రుల ఎమ్మెల్సీ పోటీ చేయాలని సూచన..??
- పట్టభద్రుల పోటికే.. సై అంటున్న ఇరువురు..
- ఆరు నెలలుగా పట్టభద్రుల ఎన్నికల ప్రచారం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ గెలుపే లక్ష్యంలో నరేందర్ రెడ్డి ప్రచారం
- ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పోటీలో ఉన్న ప్రసన్న హరికృష్ణ
- సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం



# అభయ హస్తం ఎవరికో..

కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయడానికి... పార్టీ టికెట్ కోసం ఆశావాహులు తీవ్రంగా పోటీపడుతున్నారు. ముఖ్యంగా కరీంనగర్ జిల్లా నుండి ఆల్ఫోర్ విద్యాసంస్థల అధినేత వుట్కూరి నరేందర్ రెడ్డి, మాజీ ప్రొఫెసర్, విన్నర్స్ పబ్లికేషన్స్ అధినేత ప్రసన్న హరికృష్ణ కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తే తమ విజయం సులభతరం అవుతుందని ఇద్దరు టికెట్ ఆశిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ ముఖ్యులను, అధిష్టాన పెద్దలను కలిసి టికెట్ కోసం తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇద్దరికీ జిల్లాలో మంచి పట్టు ఉండడం... ఇద్దరు విద్యారంగంలో ఉండడం వలన పట్టభద్రుల స్థానానికి పోటీ చేయడానికి సిద్ధమయ్యారు. కాంగ్రెస్ అధిష్టానం వీరిలో ఎవరికి టికెట్ ఇస్తారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న...?? .

2లో

సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి





# పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నాం

- పసుపుకు రూ 15 వేల కనీస మద్ధతు ధర ప్రకటించాలి
- ఎంపీ అర్వింద్ గాలి మాటలు మానేసి పసుపుకు మద్ధతు ధర సాధించాలి
- మేము పసుపు బోర్డు డిమాండ్ చేసినప్పుడు అర్వింద్ రాజకీయాల్లోనే లేరు
- బోర్డు సాధనకు ఎంపీగా ఉన్నప్పుడు కేంద్రంపై ఒత్తడి చేశాను
- త్రిముఖ వ్యూహంతో అలుపెరగని పోరాటం చేశాను
- నిజామాబాద్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (వివరాలు 2లో)



# అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందాలి

- ఉమ్మడి జిల్లా సమన్వయ సమావేశంలో ఇంచార్జ్ మంత్రి జూపల్లి
- పాత పథకాలను యధాతథంగా కొనసాగిస్తామని స్పష్టీకరణ
- పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు
- ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని వెల్లడి

సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (వివరాలు 2లో)



# అభయ హస్తం ఎవరికో...





**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాగైనా ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని చూస్తుంది. ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చెందిన వారై ఉండడం, కావున తిరిగి సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది. దీంతో కాంగ్రెస్ పార్టీకి ఈ స్థానం చాలా ముఖ్యమైనది. అందులో భాగంగా పార్టీ టికెట్ కోసం ఆశావాహులు తీవ్ర ప్రయత్నాలు చేయడం...అభ్యర్థి ఎంపిక ఒకింత కాంగ్రెస్ పార్టీకి కష్టంగా మారింది. ఇద్దరు మంచి పోటీ ఇచ్చే అభ్యర్థులై ఉండడం, గెలుపు అవకాశాలు ఉండడంతో అధిష్టానం టికెట్ ఖరారులో ఆచితూచి అడుగు వేస్తుంది.. మధ్యేమార్గాన ఒకరిని పట్టభద్రుల ఎమ్మెల్సీకి... ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి మరొకరిని పోటీ చేయాల్సిందిగా వారికి సూచించినట్లు తెలుస్తుంది.. కానీ వీరు పట్టబద్దుల ఎమ్మెల్సీ పోటికే ప్రాధాన్యత ఇవ్వడం వలన టికెట్ ఖరారు చేయడంతో జాప్యం జరుగుతుందని తెలుస్తుంది.

ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎవరికి వస్తుందో... లేక ఇంకెవరికైనా టికెట్ కేటాయిస్తుందో వేచి చూడాలి... అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి, మాజీ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ కచ్చితంగా పట్టబద్దుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే దృఢ సంకల్పంతో ఉన్నారు. మరి కొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో పార్టీ టికెట్ ఎవరికీ వస్తుందనేది మరికొద్ది రోజుల్లో స్పష్టమవుతుంది.

# అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందాలి

## - ఉమ్మడి జిల్లా సమన్వయ సమావేశంలో ఇంచార్జ్ మంత్రి జూపల్లి

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



పేద, బడుగు, బలహీనవర్గాలకు బాసటగా నిలువాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరేలా అంకిత భావంతో కృషి చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులకు సూచించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రత రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలపై జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి ఆదివారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉమ్మడి జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ కవిత, శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, లక్ష్మీకాంత్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డి, వెంకటరమణా రెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, నగర మేయర్ దండు నీతూ కిరణ్, కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ తదితులు పాల్గొన్నారు.

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలలో పై నాలుగు పథకాలను అమలు చేయడానికి జిల్లా యంత్రాంగాల ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల గురించి కలెక్టర్లు రాజీవ్ గాంధీ హనుమంతు, ఆశిష్ సంగ్వాన్ లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ లక్ష్యాలు, ప్రాధామ్యాలను ఇంచార్జ్ మంత్రి జూపల్లి ప్రస్తావిస్తూ, ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల ద్వారా మేలు చేకూరేలా చూడాలని అధికారులకు హితవు పలికారు. అర్హత కలిగిన ఏ ఒక్కరు కూడా మినహాయించబడకూడదని, అదే సమయంలో అనర్హులకు లబ్ధిదారుల జాబితాలో చోటు దక్కకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎలాంటి విమర్శలు, తప్పిదాలకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగాలన్నారు. ఎక్కడైనా చిన్నచిన్న లోపాలు, సాంకేతికపరమైన ఇబ్బందులు ఉంటే వాటిని సవరించుకోవాలని సూచించారు. ఇప్పటికే అమలులో ఉన్న పాత సంక్షేమ పథకాలను యధాతథంగా కొనసాగిస్తామని, ఏ ఒక్క పథకాన్ని కూడా ప్రభుత్వం ఎత్తివేయబోదని మంత్రి స్పష్టం చేశారు. పాత పథకాలకు అదనంగా మరో నాలుగు కొత్త పథకాలను ఈ నెల 26 నుండి అమలు చేయనుందని వెల్లడించారు. తమకు సంక్షేమ పథకాలు రాలేదని ఏ ఒక్కరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి, ప్రతి కుటుంబానికి తప్పనిసరిగా ప్రయోజనం చేకూరేలా చూస్తామని, ఎవరికీ అన్యాయం జరగనివ్వబోమని భరోసా కల్పించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇల్లు తదితర పథకాలు నిరంతర ప్రక్రియగా అమలు చేస్తామని అన్నారు. ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో అర్హులైన వారు ఆయా పథకాల కోసం దరఖాస్తులు అందించవచ్చని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు పథకం కింద సాగులో లేని భూములకు కూడా ఆర్థిక సాయం అందించడం వల్ల సుమారు 24 వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అయ్యిందనే విమర్శలు ఉన్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజల



కష్టార్జితంతో కూడిన ప్రతి పైసా సద్వినియోగం కావాలనే ఉద్దేశ్యంతో తమ ప్రభుత్వం సాగుకు యోగ్యం కానీ భూములను రైతు భరోసా నుండి మినహాయిస్తూ, సాగులో ఉన్న భూములకు సంబంధించిన ప్రతి రైతుకు ఎకరాకు 12 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందించాలని సంకల్పించిందన్నారు. అంతేకాకుండా సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు సైతం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతలలో 12 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అప్పులపై ప్రతీ నెల 6500 కోట్ల రూపాయల వడ్డీ చెల్లించాల్సి రావడం వల్ల ప్రభుత్వ ఖజానా తీవ్ర ఆర్థిక సంక్షోభం కూరుకుపోయి ఉన్నప్పటికీ, పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. రెండు లక్షల లోపు పంట రుణాల మాఫీ కింద రైతులకు 21 వేల కోట్ల రూపాయల మాఫీని వర్తింపజేశామని మంత్రి వివరించారు. ఇంకనూ సాంకేతిక సమస్యలు, చిన్న చిన్న కారణాల వల్ల ఎవరికైనా మాఫీ జరగకపోతే, అలాంటి వారికి కూడా మాఫీ అమలయ్యేలా చూస్తామన్నారు. కాగా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా అవసరమైతే ఆయా పథకాల నిబంధనలు సడలించాలని ఎమ్మెల్సీ కవితతో పాటు ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమన్వయ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్, నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తో పాటు ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నాం

## - నిజామాబాద్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



పసుపు బోర్డు ఏర్పాటును బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వాగతించారు. అయితే, క్వింటాలు పసుపుకు రూ. 15 వేల కనీస మద్ధతు ధర ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పసుపు దిగుమతులపై నియంత్రణ విధించాలని సూచించారు. ఈ రెండు చేసినప్పుడే పసుపు బోర్డుకు సార్థకత ఏర్పాడుతుందని, అప్పుడే పసుపు రైతులకు సంపూర్ణ న్యాయం లభిస్తుందని స్పష్టం చేశారు. తూతూమంత్రంగా పసుపు బోర్డును ఏర్పాటు చేయడం కాదని, అందుకు తగిన సౌకర్యాలు, పరిశోధన సమర్థ్యాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూర్చాలని సూచించారు.పసుపు బోర్డునే ఏర్పాటు చేయాలని తాము కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని గుర్తు చేశారు. తాము పసుపు బోర్డుపై డిమాండ్ చేసినప్పుడు బీజేపీ ఎంపీ అర్వింద్ రాజకీయాల్లో కూడా లేరని విమర్శించారు.ఆదివారం నాడు నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు.పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటించిన విధానంపై అభ్యంతరాలున్నాయని, పసుపు బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బీజేపీ కార్యక్రమంలా చేశారని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదని, ప్రొటోకాల్ ను పాటించలేదని, ఇది ప్రభుత్వ నియమనిబంధనలను విరుద్ధమని స్పష్టం చేశారు. కేవలం బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ కూర్చొని ప్రారంభించుకున్నారని, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు.పసుపు బోర్డును ఏర్పాటు చేయాలంటూ 2014లో తాను ఎంపీగా ఎన్నికైన నెల రోజుల్లోనే అప్పటి వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కు లేఖ రాశానని గుర్తు చేశారు. “పలువురు ముఖ్యమంత్రులను కలిసి పసుపు బోర్డు ఏర్పాటుకు మద్ధతుగా లేఖలు సేకరించాను. ప్రధాన మంత్రిని నరేంద్ర మోదీని రెండు సార్లు కలిసి బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశాను. పార్లమెంటును అనేక సార్లు మాట్లాడడమే కాకుండా పసుపు బోర్డు ఏర్పాటు చేయాలంటూ ప్రైవేటు మెంబర్ బిల్లును కూడా ప్రవేశపెట్టాను.” అని వివరించారు. బోర్డు ఏర్పాటు మాత్రమే కాకుండా కనీస మద్ధతు ధరను ప్రకటించాలని, దిగుమతులపై నియంత్రణ విధించాలని కూడా కేంద్రానికి అనేక సార్లు వినతులు అందించానని అన్నారు. ఇలా తాను గతంలో త్రిముఖ వ్యూహంతో అలుపెరగని పోరాటం చేశానని స్పష్టం చేశారు.పసుపు బోర్డు ఏర్పాటుకు కేంద్రంపై ఒత్తడి తెస్తూనే పసుపు ఆధారిత పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించడానికి కృషి చేశానని తెలిపారు. రకరకాల మాటలతో రైతులను, ప్రజలను మభ్యపెట్టిన బీజేపీ ఎంపీ అర్వింద్ పై విరుచుకుపడ్డారు. గాలి మాటలు మాట్లాడడం మానేసి పసుపుకు మద్ధతు ధర సాధించాలని ఎంపీ అర్వింద్ కు సూచించారు. స్పైసెస్ బోర్డును బెంజ్ కారులాంటిదని, పసుపు బోర్డు అంబాసిడర్ కారులాంటిదని గతంలో అర్వింద్ అన్నారని, పసుపును అవహేళన చేసిన అర్వింద్ కు ఇప్పుడు మాట్లాడే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. ఎంపీ అర్వింద్ కు వెకిలి మాటలు మాట్లాడడం అలవాటని, తాము పసుపు బోర్డు డిమాండ్ చేసే నాటికి అర్వింద్ అసలు రాజకీయాల్లో లేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఆయన తండ్రిచాటు బిడ్డగా ఉన్నారని విమర్శించారు. “ఎంపీగా గెలిపిస్తే ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకొస్తానని అర్వింద్ బాండ్ పేపర్ పై రాసిచ్చారు. ఎంపీగా గెలిచిన తర్వాత పసుపు బోర్డు కంటే స్పైసెస్ బోర్డే బాగుటుందని అర్వింద్ అన్నారు. స్పైసెస్ బోర్డు బెంజ్ కారులాంటిది... పసుపు బోర్డు అంబాసిడర్ కారులాంటిదని అర్వింద్ అన్నారు. ఒకవేళ బెంజ్ కారు ఉంటే... అంబాసిడర్ కారు ఎందుకు ఇచ్చినట్లు ? ఎందుకు ఇంత వైరాధ్యంతో రకరకాల మాటలు చెబుతున్నారు ? ఎంపీ అర్వింద్ గాలి మాటలు మాట్లాడడం మానేయాలి.” అని మండిపడ్డారు.తాము కేంద్రంపై పదేపదే ఒత్తిడి చేయడం వల్లే గతంలో స్పైసెస్ బోర్డు కార్యాలయం ఏర్పాటైందని, అది కూడా ఆయన గొప్పతనమని అర్వింద్ మాట్లాడడం హాస్యాస్పదమని అన్నారు. ఎవరు ఏం చేయకున్నా ప్రతి మూడో సంవత్సరం పసుపు ధర పెరుగుతుందని, కానీ అది తన ఘనత అని ఆయన చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.కాగా, స్పైసెస్ పార్కు ఏర్పాటుకు వేల్పూర్ వద్ద గతంలో కేసీఆర్ 42 ఎకరాలు కేటాయించారని, ఆ పార్కులో పసుపు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. జాక్రాన్ పల్లిలో విమానాశ్రయానికి కేసీఆర్ ప్రభుత్వం 800 ఎకరాలు సేకరించిందని, అక్కడ ఎయిర్ పోర్టు ఏర్పాటు చేయాలని ఎంపీ అర్వింద్ ను డిమాండ్ చేశారు. ఈ పత్రిక సమావేశంలో మాజీ మంత్రి , ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ , జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, బాజిరెడ్డి జగన్ , నిజామాబాద్ మేయర్ నీతు కిరణ్, మాజీ చైర్మన్ అలీమ్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు

# తాగునీరు, పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం

**- మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ - నగరంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు**

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



నిజామాబాద్ నగరంలో తాగునీరు, పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేలా సుమారు 400 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందని రాష్ట్ర ఎక్సయిజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ వెల్లడించారు. నగరంలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ లో నూతనంగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని రాష్ట్ర డీజీపీ జితేందర్, కలెక్టర్ రాజీవ్ గాంధీతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. బాలికలు, మహిళలకు రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన ఈ కేంద్రం గురించి విరివిగా ప్రచారం నిర్వహిస్తూ, మెరుగైన సేవలు అందించాలని, బాధితులకు అండగా నిలుస్తూ వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలని హితవు పలికారు. అనంతరం నిజామాబాద్ నగరంలో మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చేందుకు అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ. 380 కోట్ల వ్యయంతో చేపడుతున్న పనులకు, వరద జలాలు నిలువకుండా చేపడుతున్న స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. గోల్ హనుమాన్ వద్ద నిర్మించిన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ ఆఫీస్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి జూపల్లి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ, నగర ప్రజలకు ఇది పండుగ వాతావరణం అని హర్షం వెలిబుచ్చారు. వచ్చే యాభై సంవత్సరాల వరకు కూడా పెరిగే జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీరు, పారిశుధ్య సమస్య తలెత్తకుండా సుమారు 400 కోట్ల రూపాయల నిధులతో మంచి నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపర్చే పనులతో పాటు శానిటేషన్ దుస్థితిని దూరం చేసేలా భూగర్భ డ్రైనేజీ పనులను చేపట్టడం జరుగుతోందన్నారు. ఏడాదిన్నర కాలంలో ఈ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టు ఏజెన్సీలను ఆదేశించారు. తాగునీటి వ్యవస్థను మెరుగుపర్చేందుకే రూ. 217 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు. ఇందులో కేంద్రం వాటా 33 శాతం కాగా, రాష్ట్ర ప్రభుత్వం 59.23 శాతం నిధులను వెచ్చిస్తోందని, 14వ ఆర్థిక సంఘం ద్వారా 14.97 శాతం నిధులు మంజూరవగా, స్థానిక నగర పాలక సంస్థ 10 శాతం నిధులు భరిస్తుందని వివరించారు. ఈ నిధులతో అలీసాగర్ వద్ద 25 ఎం.ఎల్.డీ సామర్థ్యంతో కూడిన స్టోరేజ్ ట్యాంకులు నిర్మిస్తున్నారని, ప్రతి రోజు 2.5 కోట్ల లీటర్ల నీటిని శుద్ధి చేసి నగర ప్రజలకు రక్షిత జలాలు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న మంచినీటి ట్యాంకులకు అదనంగా ఆయా ప్రాంతాలలో అదనంగా మరో 18 ట్యాంకులను నిర్మిస్తున్నారని అన్నారు. అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న భూగర్భ డ్రైనేజ్ పనులను పూర్తి చేసేందుకు మరో 162 కోట్ల రూపాయలను మంజూరు చేయించామని తెలిపారు. గడిచిన పదేళ్లలో స్తంభించిపోయిన అభివృద్ధి పనులను తమ ప్రభుత్వం శరవేగంగా చేపడుతూ, ప్రజలకు మౌలిక వసతులను మెరుగుపర్చే పనులను చేపడుతోందని తెలిపారు. రైతులకు లబ్ది చేకూర్చేందుకు 21 వేల కోట్ల రూపాయల పంట రుణాలను మాఫీ చేశామని, మరో 21 వేల కోట్ల రూపాయలతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో మొదటి విడతగా 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని వివరించారు. ఒక్క నిజామాబాద్ అర్బన్ సెగ్మెంట్లోనే ఇందిరమ్మ ఇళ్ల కోసం 175 కోట్ల రూపాయలను వెచ్చించనున్నామని తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలకు కూడా ప్రభుతం ఈ నెల 26 నుండి శ్రీకారం చుడుతోందని అన్నారు. కేవలం ఏడాది కాలంలోనే ఇన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిన తమ ప్రభుత్వం, రానున్న నాలుగేళ్లలో మరింత విస్తృత స్థాయిలో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనుందని తెలిపారు. ప్రజలు వాస్తవాలను గమనించాలని, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు పలువురు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. కాగా, ప్రతి ఒక్కరు తమ దైనందిన జీవన శైలిలో మార్పులు చేసుకోవాలని, యోగా, వ్యాయామానికి తప్పనిసరిగా కొంత సమయాన్ని కేటాయిస్తూ ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని మంత్రి జూపల్లి హితవు పలికారు. అనవసర ఆడంబరాలకు పోయి వేడుకల పేరుతో కష్టార్జితాన్ని వృధా చేసుకోకూడని, నిష్ణాతులైన ఉపాధ్యాయులు, నాణ్యమైన బోధన అందిస్తున్న ప్రభుత్వ బడులలో పిల్లలను చదివిస్తూ డబ్బులను ఆదా చేసుకోవాలని జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమాల్లో శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, జోన్ ఐ.జీ చంద్రశేఖర్ రెడ్డి, ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ సింధు శర్మ, నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడా చైర్మన్ కేశ వేణు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కవి ్షన్ సభ్యులు గడుగు గంగాధర్, ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డు రానివారు ఆందోళన చెందొద్దు

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారగౌడ్**

**సూర్య, లింగంపేట్**



రేషన్ కార్డులు రానివారు ఆందోళన చెందవద్దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారగౌడ్ అన్నారు. ఆయన ఆదివారం విలేకరులకు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామసభల్లో రేషన్ కార్డ్ దరఖాస్తులు తీసుకుంటూ అర్హులైన వారికి కచ్చితంగా రేషన్ కార్డులు ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. పంచాయతీలకు పంపింది తుది జాబితా కాదన్నారు. రేషన్ కార్డుల జారిపై మంత్రి ఉత్తం కుమార్ కీలక ప్రకటన చేశారని రేషన్ కార్డుల జారి నిరంతర ప్రక్రియని స్పష్టం చేశారన్నారు. రేషన్ కార్డు రానివారు తమ గ్రామంలో జరిగే గ్రామసభల్లో కచ్చితంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## మానవత్వం చాటుకున్న మాచారెడ్డి మాజీ ఎంపీపీ

**సూర్య రాజంపేట**



మాచారెడ్డి నుండి కామారెడ్డికి వెళుతున్న మాచారెడ్డి మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగ్ రావు, కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామ రహదారి పై ప్రమాదంలో గాయపడి రోడ్డు పక్కన పడిఉన్న వ్యక్తిని చూసి తన కారు ఆపి దిగి, అతని దగ్గరకు వెళ్లారు. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడానికి సహాయపడ్డారు. అంతేకాకుండా డాక్టర్‌ను సంప్రదించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. నర్సింగ్ రావు చేసిన ఈ మానవతా కార్యానికి స్థానికులు ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ జీడిపల్లి నరసింహారెడ్డి, కౌన్సిలర్ రామ్మోహన్, సాయికుమార్ గౌడ్ కూడా ఆయనతో పాటు ఉన్నారు..

## పేకాటపై దాడి: ఏడుగురిపై కేసు నమోదు

**సూర్య రాజంపేట**

రాజంపేట మండలంలోని బసవన్నపల్లి-అరగొండ గ్రామ శివారులో ఆదివారం పేకాట ఆడుతున్న సమాచారం మేరకు రాజంపేట ఎస్సై పుష్ప రాజ్ ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకుని, వారి వద్ద నుండి 7 సెల్ ఫోన్లు, 6 వాహనాలు, ?58,350 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, విచారణ కొనసాగిస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. ప్రజలు ఇలాంటి చట్టవిరుద్ధ క్రియాకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు..

## జాతీయ పసుపు బోర్డు చైర్మన్ ను కలిసిన కామారెడ్డి ఎమ్మెల్యే

**సూర్య కామారెడ్డి**



జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డిని ఆదివారం నాడు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకుశుభాకాంక్షలు తెలియజ శారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ హామీ ఇచ్చిన మేరకు పసుపు బోర్డు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. పసుపు బోర్డు వల్ల ఎంతోరైతులకు మేలు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బోర్డు తక్షణం అమల్లోకి వస్తుందని దీనికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు సమకూ రుస్తుందని ఆయన అన్నారు. ఆయనతోపాటు బిజెపి కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ కళ్యాణ మండప నిర్మాణానికి మాజీ సర్పంచ్ విరాళం

**సూర్య- బిక్కనూర్**



మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన ముదిరాజ్ కళ్యాణ మండప నిర్మాణానికి పట్టణ మాజీ సర్పంచ్ తునికి వేణు 5 లక్షల రూపాయల విరాళాన్ని ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు బండి రాములుకు ఆదివారం సంఘ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు సంఘ అభివృద్ధికి తనవంతుగా ఐదు లక్షల విరాళాన్ని అందజేసినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని, ముదిరాజ్ కులస్తులు పార్టీలకతీతంగా ఐకమత్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు తునికి వేణును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులైన సీనియర్ న్యాయవాదులు నంద రమేష్, గజ్జల బిక్షపతి, సింగిల్ విండో సొసైటీ చైర్మన్ గంగల భూమయ్య, రైతుబంధు మాజీ అధ్యక్షుడు బోండ్ల రామచంద్రం, మాజీ ఎంపీటీసీ బత్తుల నరసింహులు, నాయకులు నీలా ఆంజనేయులు, సంఘ సభ్యులు పసుల రమేష్ సభ్యులు ఉన్నారు

## ఆరోగ్య తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

**సూర్య- బిక్కనూర్**



రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చెప్పారు. ఆదివారం మండలానికి చెందిన బత్తుల సంజీవ్ కుమార్,లింగాల స్వప్న లకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన 1 లక్ష 20వేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. అనంతరం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 6 గ్యారంటీలతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని, ఈనెల 26 నుండి రైతులకు రైతు భరోసా కింద ఎకరానికి 12 వేలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమ్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లింబాద్రి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్యాల సుదర్శన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేత

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన యశ్వంత్ అనే వ్యక్తి మృతి చెందడంతో నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన యూత్ ఫర్ యూనిటీ సభ్యులు ఆదివారం 31 వేల 2 వందల రూపాయల నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా యూత్ ఫర్ యూనిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆపత్కాలంలో ఆదుకున్న యూత్ ఫర్ యూనిటీ సభ్యులను గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు అభినందించారు

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ జడ్పిటిసి

**సూర్య నాగిరెడ్డి పేట్**



మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన సుభాన్రెడ్డి తల్లి వెంకటమ్మ ఇటీవల మృతిచెందగా ఆదివారం స్థానిక మాజీ జెడ్పిటిసి మనోహర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం నింపారు. అనంతరం తాండూర్ గ్రామానికి చెందిన టిఆర్ఎస్ సీనియర్ నాయకులు పడమటి దుర్గేష్ తండ్రి ఇటీవల చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులను పరామ ర్శించి బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ జెడ్పిటిసి వెంటా ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్ రెడ్డి,నాయకులు మధుసూదన్రెడ్డి,పీకే రాజు ఉన్నారు.

## మున్నూరుకాపు కార్యాలయం ప్రారంభోత్సవం..

**సూర్య రాజంపేట**



మున్నూరుకాపు ఉత్తర తెలంగాణ జిల్లాలకు చెందిన కార్యాలయ ప్రారంభోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు దేవన్న ప్రత్యేక అతిథిగా హాజరై, కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఆయనను శాలువాతో ఘనంగా కామారెడ్డి మండలంలోని చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మున్నూరు కాపు యువ నాయకుడు అన్మాల రామ్ కుమార్ సత్కరించారు. మున్నూరుకాపు కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సభ్యులంతా సమాజానికి సేవ చేయడానికి కార్యాలయం ఉపయోగపడాలని అన్మాల రామ్ కుమార్ ఆకాంక్షించారు.

# ఆ ఆరుగురిలో అదృష్టవంతుడు ఎవరు...

## - అధ్యక్ష పదవి కోసం తీవ్ర పోటీ.. - కమలం పార్టీలో యువతకు ప్రాధాన్యత..

**సూర్య - నవీపేట్**

మండల బిజెపి పార్టీ అధ్యక్ష పదవి కాలం ముగియడంతో అధ్యక్ష పదవి కోసం తీవ్ర పోటీ నెలకొంది. మండలం నుండి ఆరుగురు ఆశావహులు ఉన్నందున వారి పేర్లు అధిష్టానం చెంతకు చేరాయి. అధ్యక్ష పదవికి పోటీలో ఉన్న వారిలో ఎవరు సమర్థులనే విషయాన్ని అధిష్టానం లెక్కలు వేసుకుంటుంది. ఈ మేరకు సామాజిక సమీకరణాలలో భాగంగా ఎవరికి పార్టీ పగ్గాలు అప్పగించాలన్న అంశంపై అంతర్గతంగా అభిప్రాయ సేకరణ కూడా చేస్తుంది. ఆరుగురిలో అదృష్టం ఎవరిని వరిస్తుందో అని ఉత్కంఠ నెలకుంది. ఆరుగురు అధిష్టానం వద్ద తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అధ్యక్ష పదవి పోటీలో ఉన్న ఆరుగురిలో నలుగురు బిసి, ఇద్దరు ఎస్సీలు ఉన్నారు. ఇందులో ఒకరిద్దరు మినహా మిగతావారు పార్టీ కొరకు పూర్తి సమయాన్ని





కేటాయించి భారీగా సభ్యత్వాలు నమోదు చేసి, గ్రామాల్లో తిరుగుతూ బూత్ కమిటీలు వేయడంలో ప్రధాన పాత్ర పోషించారు.మండలంలో 52 బూత్ కమిటీలకు గాని 36 బూత్ కమిటీల అధ్యక్షులను ఎన్నుకోగా మిగతా 16 త్వరలో పూర్తి చేయనున్నారు. పార్టీ నియమావళి ప్రకారం అధ్యక్షుడు మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు అలా వరుసగా రెండు సార్లు కొనసాగే అవకాశం ఉంది కానీ మూడోసారి మాత్రం అవకాశం ఉండదు. ప్రస్తుత అధ్యక్షుడు మరొక అవకాశం ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నాడు. నియమావళి ప్రకారం అధ్యక్ష పదవికి 45 సంవత్సరాల లోపు వయసు ఉన్న వారిని అధ్యక్షుడిగా ఎన్నుకోవాలి కాబట్టి ఈసారి యువతని అధ్యక్ష పదవి వరిస్తుందని యువకులు ఆశాభావంతో ఉన్నారు. ఒకవేళ ఈ నిబంధనలు అమలు చేస్తే ఇద్దరు ముగ్గురు మధ్యలో పోటీ ఉండనుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కొత్త అధ్యక్షుడి నియామకం జరుగుతున్నందున కొత్త జోష్ తో స్థానిక సంస్థల సమరానికి బిజెపి పార్టీ సై అంటుందన్న దాంట్లో ఏమాత్రం అనుమానం లేదు. అధికార పార్టీకి ప్రతికూలంగా ఉన్న పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకొని మండలంలో పాగా వేయాలని చూస్తోంది. కానీ గత అసెంబ్లీ ఎన్నికలలో కొంతమంది బిజెపి నాయకులు అధికార పార్టీకి సహకరించారనే అపవాదు తుడిచిపెట్టుకుపోవాలంటే అధికార పార్టీని తట్టుకొని ఎంతవరకు సఫలం కాగలదనేది ప్రశ్న.

**- కనుమరుగైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు..**

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అత్యుత్సాహం ప్రదర్శించి ముక్కు ముఖం తెలియని ప్రతి ఒక్కరిని ఇంటికి వెళ్లి పలకరించారు. ఎన్నికల తర్వాత బోధన్ లో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి అప్పటినుండి కనుమరుగైపోయారు. పైన భారం వేసుకొని పార్టీని ముందుకు నడిపే నాయకులు లేకపోవడంతో మండలంలో మంచి పట్టున్న కమలం పార్టీకి నష్టం జరుగుతుంది. ఇప్పటికైనా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దృష్టి సారించి పట్టించుకుంటే స్థానిక సంస్థల ఎన్నికలలో మంచి ఫలితాలు రావచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో నూతన మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలా సిద్ధమవుతుందో వేచి చూడాలి.

## అ"పూర్వ" కలయిక...

**సూర్య, భీమ్‌గల్**



దాదాపు 30 ఏళ్ల కిందట చదువుకున్న పదవ తరగతి విద్యార్థులు ఒకచోట చేరి వారి అనురాగ స్మృతులను నెమరువేసుకున్నారు. అప్పటి మధుర జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకుంటూ ఆనందంతో పరవశించిపోయారు. ఈ అపూర్వ ఘట్టం ఆదివారం పట్టణంలో జే.బి.ఎన్ ఫంక్షన్ హాల్‌లో తారసపడింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1995-96 ఎస్ఎస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి విద్యానందించిన గురువులను ఘనంగా సత్కరించారు. 30ఏళ్ల అనంతరం ఒకేచోట చేరిన పాతమిత్రులు పరస్పరం యోగా క్షేమాలు తెలుసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో మల్లెల లక్షన్, జే.జే నర్సయ్య,మురళీ,పురస్తూ నరేష్, పత్రి శ్రీనివాస్,పవన్ తదితరులు ఉన్నారు.

## నాగిరెడ్డి పేటలో కాంగ్రెస్ నాయకుల పల్లెనిద్ర ..

**సూర్య నాగిరెడ్డి పేట్**



ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు శనివారం రాత్రి మండలంలోని నాగిరెడ్డిపేట్, గ్రామాలల్లో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించి గ్రామంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి నిధులు ఎంత మేరకు అవసరం అవుతాయో సమావేశంలో చర్చించారు.అనంతరం పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తున్నామని, ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను, అభివృద్ధి పనులను ప్రతి గడపగడపకు తీసుకెళుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సాయ గౌడ్,మాజీ సర్పంచ్ విట్టల్ రెడ్డి,కోఆర్డినేటర్ సభ్యులు నర్సింహారెడ్డి,మండల ఉపాధ్యక్షులు లక్ష్మణ్ ఠాగూర్,మండల మయినార్టీ అధ్యక్షులు ఇమామ్, ఏఎంసీ డైరెక్టర్ నాగేశ్వర్,ఫరూక్ సాబ్ నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షులు గులాం హుస్సేన్,నాయకులు మన్నే వెంకట్, బోయిని హన్మాండ్లు, మన్నే యాదగిరి, శ్రీనివాస్ గౌడ్, కుమ్మరి ,విట్టల్ , మల్లేశం, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేషన్ చేసిన ప్రతి ఒక్కరు బిజెపికి సపోర్ట్ చేయాలి

### -రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి రామిరెడ్డి

**సూర్య,లింగంపేట్**



గ్రాడ్యుయేషన్ చేసిన ప్రతి ఒక్కరు బిజెపికి సపోర్ట్ చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి రామిరెడ్డి అన్నారు.ఆయన ఆదివారం లింగంపేట్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు ఎమ్మెల్సీ ఎలక్షన్లో బిజెపి అభ్యర్థికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించి బిజెపికి మద్దతుగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మర్రి బాపురెడ్డి,మహారాజుల మురళి,జిల్లా కార్యవర్గ సభ్యులు జక్సాని దత్తు రాములు,మండల ప్రధాన కార్యదర్శి వడ్ల రామచందర్,నవీన్ కుమార్,బూత్ కమిటీ అధ్యక్షులు బొల్లు గణేష్,భీమయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## కామారెడ్డి మాస్టర్ ప్లాన్ ను వెంటనే రద్దు చేయాలి

**సూర్య, కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి పట్టణ విస్తరణను ఉద్దేశించిన మాస్టర్ ప్లాన్ ను వేంటనే రద్దు చేయాలని రైతు ఐక్య కార్యచరణ కమిటి ప్రతినిధులు డిమాండ్ చేశారు. సదాశివ నగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో అదివారం మాస్టర్ ప్లాన్ బాధితులు సమావేశమయ్యారు. కామారెడ్డి మాస్టర్ ప్లాన్ లో చూపించిన గ్రీన్ జోన్, ఇండస్ట్రీయల్ జోన్ లలో వ్యవసాయ భూములు చేర్చడాన్ని నిరశిస్తు ఎడాది కాలంగా 8 విలీన గ్రామాల రైతులు అందోళన చేస్తున్న విషయం తెలిసిందే. గత ప్రభుత్వం కామారెడ్డి మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తున్నమని ప్రకటించిన ఇప్పటి వరకు సంబంధిత గేజిట్ మాత్రం విడుధల కాలేదు. దానితో ఇటివల అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన శ్రీకాంత్ రెడ్డి అను రైతు అమరణ నిరహర దీక్ష చేపట్టగా రైతులు విరమింప చేశారు. ఈ నేపథ్యంలో రైతులు మరోసారి సమావేశమై ఖచ్చితంగా కామారెడ్డి మాస్టర్ ప్లాన్ ను రద్దు చేయాలని ఈ విషయం కామారెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే లను కలిసి ప్రభుత్వం పై ఒత్తిడి తెవాలని నిర్ణయించారు. మాస్టర్ ప్లాన్ ను వెంటనే రద్దు చేస్తున్నట్టు జి. ఓ కాపీ జారీ చేయాలి. లేదంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని రైతులు ప్రకటించారు.

## నేడే లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద ఆధ్వర్యంలో ఇంపాక్ట్ కార్యక్రమం.

**సూర్య, కామారెడ్డి జిల్లా ప్రతినిధి**




నేడు, రేపు లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద కామారెడ్డి ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో ఉదయం 10 గంటల సాయంత్రం 5 గంటల వరకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యక్తిత్వ వికాస సంస్థ వారిచే విద్యార్థులకు, యువతకు, వివిధ పోటీ పరీక్షల నిమిత్తమై శిక్షణ పొందుతున్న యువతకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద అధ్యక్షులు లయన్ చిలువేరి మారుతి,కార్యదర్శి లయన్ దొంతుల కృష్ణ హరి, క్యాషియర్ లయన్ మురికి రాజశేఖర్ ప్రోగ్రాం చైర్మన్ మరియు ప్రోగ్రాం చైర్మన్ మరియు కో చైర్మన్ లయన్ ఉప్పల హరిధర్, లయన్ కైలాస్ భూపేష్ లో పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ప్రముఖ గంప నాగేశ్వర్ రావు వ్యక్తిత్వ వికాస నిపుణుల బృందంచే అవగాహన కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో యువత , విద్యార్థులు, వ్యాపారస్తులు, కుటుంబ సభ్యులు విచ్చేసి విజయవంతం చేయాలన్నారు. మరిన్ని వివరాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద అధ్యక్షులు చిలువేరి మారుతి 98857 07042 ను సంప్రదించాలని అన్నారు.

## వెయ్యి గొంతుకలు..లక్ష డప్పుల సాంస్కృతిక ప్రదర్శన

**సూర్య రెంజల్**



ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధించుకోవడం కొరకే వెయ్యి గొంతుకలు లక్ష డప్పుల సాంస్కృతిక ప్రదర్శనతో ఉత్తేజం పరచడానికి కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లసింగారి భూమయ్య తెలిపారు. రెంజల్ మండలంలోని నీలా గ్రామంలో శనివారం రాత్రి 1000 గొంతులు, లక్ష డప్పుల సాంస్కృతిక ప్రదర్శన రథయాత్ర చేరుకుందని తెలిపారు.నిజామాబాద్ జిల్లాలోని 58 అన్నిమండలాలు తిరిగి మాదిగలను,చైతన్యం చేస్తుందని ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణలు సాధించుకోవటానికి, ఫిబ్రవరి 7 నాడు హైదారాబాద్ లో జరిగే వెయ్యి గొంతుకలు.. లక్ష డప్పులు సాంస్కృతిక మహా ప్రదర్శనను విజయవంతమం చెయ్యాలని పిలుపునివ్వడం జరిగింది.ఫిబ్రవరి 7 వరకు వర్గీకరణను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తే విజయోత్సవ ప్రదర్శన ఉంటుంది. లేకపోతే వర్గీకరణ వ్యతిరేక శక్తులు అడ్డుపడుతున్న వారి యొక్క చావు డబ్బుల మోతా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాదిగ కళామండలి జిల్లా అధ్యక్షులు నల్ల మహేందర్ మాదిగ, డప్పు కళాకారులు మండలి అధ్యక్షుడు డప్పు సంతోష్ మాదిగ, నవీన్ మాదిగ, డోల నర్సింగ్, దూశాంత్,పద్మ,శ్రీజ, జిల్లా సహాయ కార్యదర్శి బండారి పోశెట్టి మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి మాదిగ, కిన్నెర మోహన్ మండల కో ఇన్చార్జి రవి ,వినోద్, అబ్బయ్య, నరేష్,ఆనంద్ , సాయిలు, విజయ్,తదితరులు పాల్గొన్నారు.

## పశువుల పాకకు నిప్పంటుకొని మూగజీవులు మృతి..

**సూర్య నవీపేట్**



మండలంలోని పోతంగల్ గ్రామంలో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ తో అగ్నిప్రమాదం సంభవించి రెండు ఆవులు సజీవ దహనం కాగా మరో నాలుగు గాయ పడ్డాయి.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం చిలుక సాయిబాబాకు చెందిన ఆవులను తన పశువుల పాకలో రోజులాగే కట్టివేయాగా శనివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం సంభవించి పశువుల పాకతో పాటు గడ్డివాముకు నిప్పు అంటుకోని మంటలు వ్యాపించగా కొట్టంలోని కట్టివేసిన రెండు ఆవులు సజీవధానం అయ్యాయి. ఈ ప్రమాదంలో మరో నాలుగు ఆవులు తీవ్రంగా గాయపడ్డాయి. ఇష్టపడి పెంచుకున్న మూగజీవాలు మృతి చెందడంతో మూడు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. వారి కుటుంబానికి ప్రభుత్వం తరపున ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యములో ఘనంగా ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్..

**.సూర్య .బీర్కూర్.**



బీర్కూర్ మండలంలో గత వారం రోజుల నుండి నిర్వహిస్తున్న నియోజకవర్గ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం రోజు ఘనంగా ముగిసింది.విన్నర్ టీమ్ గా కోడిచెర్ల, రన్నర్ టీమ్ గా బీర్కూర్ గ్రామాలు నిలిచాయి. గెలిచిన టీమ్స్ కి కప్పు తో పాటు నగదు బహుమతిని స్థానిక కాంగ్రెస్ యువ నాయకుడు శశికాంత్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆటగాళ్లకు గెలుపోటములు సహజమని ఓడిపోయిన టీమ్ తప్పు ని సరిదిద్దుకొని గెలుపు కోసం అవకాశం ఏర్పరుచుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు ప్రవీణ్, ప్రశాంత్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు కాంగ్రెస్ కమిటీలుగా ఉన్నాయి

## - అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమన్వయ సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతు... అర్బన్ నియోజకవర్గంలో గత 11 సంవత్సరాల నుండి ఒక్క ఇళ్ళు కూడా ఇవ్వలేదని నాగారంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు శిథిలావస్థలో ఉన్నాయన్నారు.హౌసింగ్ మంత్రి పోగులేటి దసరాకే ఇండ్లు ఇస్తామని సంక్రాతి వచ్చిన మోక్షం లేదన్నారు.వాటి మరమ్మత్తులకు సరిపడా నిధులు కేటాయించి GO కి వ్యతిరేకంగా జరిగిన జాబితాను రద్దు చేసి అర్హులైన జాబితాను GO ప్రకారం ఎంపిక చేయాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల విషయంలో నియోజకవర్గంలో సంవత్సరానికి 3500 ఇండ్లు ఇస్తామని ఇప్పుడు మొదట జాగా ఉన్నవాళ్ళకే అనడం వల్ల అర్బన్ లో కేవలం 1600 లబ్దిదారులను మాత్రమే గుర్తించారని అన్నారు.జాగా లేని పేద %ు% మధ్యతరగతి వాళ్ళు చాలా మంది ఉన్నారని వారికీ నష్టం జరగకుండా వారికీ మొదటి దశలోనే వారికీ న్యాయం చేయాలన్నారు అలాగే అర్బన్ నియోజకవర్గనికి 7వేల ఇండ్లు మంజూరు చేయాలనీ ఇదే విషయం పై అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడం జరిగిందని గుర్తుచేసారు.ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు కాంగ్రెస్ కమిటీలుగా ఉన్నాయని అన్నారు కమిటీల్లో



ప్రతిపక్షలకు సమూచిత అవకాశం కల్పించడం వల్ల లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని అన్నారు.కొత్త రేషన్ కార్డులు జారీ ప్రక్రియలో ప్రభుత్వం ఆంక్షల పేరుతో కోతలు పెడుతుందని అన్నారు,ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకానికి రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకుంటారు కాబట్టి కోతలు పెట్టి గరిబోళ్ల కడుపు కొట్టొద్దని మంత్రిగారిని కోరారు.అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రేషన్ కార్డులు కట్ చేయకుండా కొత్తవారికి కూడా జారీ చేయాలనీ సూచించారు.ఫోర్ వీలర్ వాహనాదారులకు రేషన్ తొలగించడం, కొత్తవి జారి చేసే విషయంలో సొంత క్యాబ్, ఆటో నడుపుకునే వారిని దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు,ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులకు, మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులకు ప్రభుత్వం నుండి ఎంపిక చేసి వచ్చిన జాబితాకు చాలా తేడా ఉందన్నారు దీని ద్వారా అర్హులైన లబ్దిదారులు నష్టపోయే అవకాశం ఉందని అన్నారు.రైతు భరోసా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న 15 వేలు ఇవ్వాలని సూచించారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో రైతు కూలీలకు ఇస్తామన్నా 12వేలు ఎటువంటి ఆంక్షలు లేకుండా అర్హులైన వారందరికీ అందేల చర్యలు తీసుకోవాలని సూచించారు.గత ప్రభుత్వం హయాంలో కొత్త రేషన్, జాబ్ కార్డు మంజూరు జరగలేదని అన్నారు జాబ్ కార్డు లేని కూలీలు వేల సంఖ్యలో మంది ఉన్నారని వారిని కూడా దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోవాల న్నారు. నగరంలో శిథిలావస్థలో ఉన్న బస్టాండ్ ను ఆధునిక హంగులతో పునర్ నిర్మించాలని ఆధునిక సౌకర్యాలు వైటింగ్ హాల్,డిజిటల్ స్క్రీన్, పార్కింగ్, సెక్యూరిటీ,వంటి సౌకర్యాలు కల్పించా లని వినతిపత్రం అందించారు, నియోజకవర్గనికి ఇంటిగ్రెటెడ్ స్కూల్ మంజూరు చేయాలనీ అలాగే నియోజకవర్గనికి రావలిసిన %జణఖీ% ఫండ్ విడుదల చేయాలనీ ఇదే అంశం ముఖ్యమంత్రి గారి దృష్టికి కూడా తీసుకుపోవడం జరిగిందని సీడీఫ్ తో పాటు స్పెషల్ ఫండ్ వంద కోట్లు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజురు చేయాలనీ మంత్రి జూపల్లికి వినతిపత్రం అందించారు.

# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వ్యక్తిత్వ వికాసంపై ఉచిత శిక్షణ

**సూర్య కామారెడ్డి క్రైమ్**



లైన్స్ క్లబ్ ఆఫ్ కామారెడ్డి వివేకానంద వారి ఆధ్వర్యంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యక్తిత్వ వికాసం సంస్థ (గంప నాగేశ్వరరావు) బృందం వారిచే విద్యార్థులకు ఉచిత వ్యక్తిత్వ వికాసం పై శిక్షణా కార్యక్రమం. నిర్వహించబడునని లైన్స్ క్లబ్ అధ్యక్షులు చిలువేరు మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 20 మరియు 21 నాడు రెండు రోజులు కళాభారతి కామారెడ్డి నందు లయన్స్ క్లబ్ వివేకానంద కామారెడ్డి వారి ఆధ్వర్యంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యక్తిత్వ వికాస సంస్థ వారిచే విద్యార్థులు యువతకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ చిలివేరి మారుతి ,కార్యదర్శి లయన్ దొంతుల హరికృష్ణ, క్యాషియర్ లయన్ మురికి రాజశేఖర్, ప్రోగ్రాం చైర్మన్ మరియు కో చైర్మన్ లయన్ ఉప్పల హరిధర్ మరియు లయన్ కైలాస్ భూపేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

జనవరి 20 సోమవారం నాడు ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒకటి




గంటల వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం రెండు నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు, అలాగే జనవరి 21 మంగళవారం నాడు ఉదయం 10 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు డిగ్రీ మరియు పీజీ విద్యార్థులతో పాటు ఉద్యోగులు, వ్యాపారస్తులు, తల్లిదండ్రులు యువతకు ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని రాష్ట్రంలోని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుల బృందం ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తారని ఈ ఉచిత అవకాశాన్ని విద్యార్థులు యువత తప్పక వినియోగించుకుని నవ సమాజ నిర్మాణానికై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు ఈ సందర్భంగా తెలిపారు.

# కిరాణా వర్తక సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

**సూర్య రాజంపేట**



రాజంపేట కిరాణా వర్తక సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకాగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం కార్యదర్శి బచ్చు శ్రీనివాస్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యవర్గాన్ని చుక్కాపూర్ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం యందు ఎన్నుకోవడం జరిగిందని అధ్యక్షులుగా మొగులు చంద్రమౌళి గుప్తా,ఉపాధ్యక్షులుగా మొగిలిపల్లి రాజు, కార్యదర్శిగా బచ్చు శ్రీనివాస్ గుప్త, కోశాధికారిగా ముత్యపు వెంకట రాజేశ్వర్ గుప్తా, కార్యవర్గం సభ్యులుగా వలిపిశెట్టి ప్రవీణ్, బంధం పద్మారావు, బంధం అనిల్, నాయిని శ్రీనివాస్, బంధం నర్సింలు, కటకం రాజు, తొడంగల్ నర్సింలు, ఆముద సంకిత్. డి. నరేందర్ ను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు చంద్రమౌళి గుప్తా మాట్లాడుతూ కిరాణా వర్తక సంఘ అభివృద్ధికి దోహదపడతానని తనకు అవకాశం ఇచ్చి మళ్లీ అధ్యక్షులుగా ఎన్నుకున్న ప్రతి ఒక్క సభ్యునికి కృతజ్ఞతలు తెలిపారు..

# కామారెడ్డి ముశ్రీఫ్ బాగ్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా దన్నారపు రాజలింగం ఎన్నిక

**సూర్య కామారెడ్డి**

కామారెడ్డి పట్టణంలోని స్థానిక ముశ్రీఫ్ బాగ్ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా దన్నారపు రాజలింగంను ఆదివారం నాడు ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బెజగం సంతోష్, ప్రధాన కార్యదర్శిగా పైడి శ్రీనివాస్ గుప్త, ఉప కార్యదర్శిగా మ్యాదం ప్రభాకర్, పబ్బ మల్లేశం, కోశాధికారిగా చికోటి రాజేశ్వర్,ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గరిపల్లి శివకుమార్ లు ఎన్నికైనట్లు వారు తెలిపారు. అధ్యక్షులు దన్నారపు రాజలింగం మాట్లాడుతూ నూతన కార్యవర్గం సంఘ సభ్యులకు కార్యవర్గ సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు. ఎవరికి ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. సందర్భంగా ఆర్యవైశ్య సంఘ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు..



# బోధన్ బార్ అసోసియేషన్ క్రికెట్ జట్టుపై నిజామాబాద్ విజయం.

**సూర్య ఇందూరు**



ఆదివారం నిజామాబాద్ పాలిటెక్నిక్ గ్రౌండ్లో క్రికెట్ పో టిలో బోధన్ బార్ అసోసియేషన్ క్రికెట్ జట్టుపై నిజామాబాద్ బార్ అసోసియేషన్ క్రికెట్ జట్టు విజయం సాధించింది. బోధన్ జట్టు సమ్మయ్య నాయకత్వంలో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన బోధన్ ఇరవై ఓవర్లలో మూడు వికెట్లు నష్టపోయి మొత్తం128 పరుగులు చేసింది.ఆ తరువాత బ్యాటింగ్ చేసిన నిజామాబాద్ 11.2 ఓవర్లలోనే 129 పరుగులు చేసి విజయాన్ని మూటగట్టుకుంది.న్యాయవాది సుజిత్ 64 పరుగులు చేసి అల్ రౌండర్ ప్రతిభ కనపరిచారు.నిజామాబాద్ బార్ క్రికెట్ జట్టు కెప్టెన్ జగన్మోహన్ గౌడ్ స్ఫూర్తి దాయకమైన ఆటను ప్రదర్శించిన వారికి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా బార్ ఉపాధ్యక్షుడు పెండెం రాజు ,ప్రధాన కార్యదర్శి వసంత్ రావు మాట్లాడుతూ నేటితో క్రికెట్ పోటీలు ముగిశాయని,క్యారమ్స్,షెటిల్,చెస్,టెబుల్ టెన్నిస్ పోటీలు కొనసాగుతున్నాయని పోటీలలోని విజేతలకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిలాకోర్టు ప్రాంగణంలో జరుగనున్న కార్యక్రమంలో జిల్లాజడ్జి సునీత కుంచాల,బార్ అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్,బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్ రెడ్డి అతిథులుగా పాల్గొని బహుమతులు అందజేయనున్నారని వారు తెలిపారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ క్రికెట్ జట్టు జగన్ మోహన్ గౌడ్ కెప్టెన్ గా విహరించి గా జట్టులో యెర్రం విఘ్నేష్ డాన్వల్ సురేష్ సుజీత్ ఉదయ్ కృష్ణ ఏ దీపక్ ఎన్ ఎస్ చౌదరి హామీమ్ ప్రమోద్ వెంకటేశ్వర్ అయ్యుబ్ ప్రకాష్ కె ఎస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# పోలీస్ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ

**సూర్య కామారెడ్డి బ్యూరో**



కామారెడ్డి జిల్లా కేంద్రంలో స్థానిక యాసంపల్లి రోడ్డు శివారులో పోలీస్ గెస్ట్ హౌస్ ఆదివారం తెలంగాణ రాష్ట్ర డిజిపి జితేందర్ రెడ్డి ప్రారంభించారు. ఆయనతోపాటు విచ్చేసిన చంద్రశేఖర్ రెడ్డి IPS మల్టీ జోన్-1 ఐజిపి పాల్గొన్నారు. నిజాంబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని తిరిగి హైదరాబాద్ వెళుతుండగా గెస్ట్ హౌస్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ గెస్ట్ హౌస్ ఏర్పాటుకు సహకరించిన పోలీస్ అధికారులకుడీజీపీ చేతుల మీదుగా జ్ఞాపకను అందుకున్న కామారెడ్డి పోలీస్ అధికారులు, సిబ్బంది క్యాసంపల్లి శివారులో గల పోలీస్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ నందు ఆదివారం రోజున డిజిపి నూతనంగా నిర్మించిన పోలీస్ గెస్ట్ హౌస్ ను ప్రారంభించడం జరిగింది.విధి నిర్వహణతో పాటుగా ప్రత్యేక శ్రద్ధ కనబరిచి పోలీస్ గెస్ట్ హౌస్ ఏర్పాటుకు తమ వంతుగా కృషి చేసిన పోలీస్ అధికారులు కామారెడ్డి రూరల్ ఇన్స్పెక్టర్ రామన్, దేవునిపల్లి ఎస్ హెచ్ ఓ రాజు మరియు సిబ్బందిని డిజిపి జ్ఞాపికతోని అభినందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ డా.. జితేందర్ IPS , చంద్రశేఖర్ రెడ్డి IPS మల్టీ జోన్-1 ఐజిపి, జిల్లా ఎస్పి సింధు శర్మ ఐపిఎస్, కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు ఎస్పీ అడ్మిన్ కే నరసింహారెడ్డి , డిఎస్పిలు శ్రీనివాసులు , సత్యనారాయణ, ఎస్బి ఇన్స్పెక్టర్, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తబాద్ టోర్నమెంట్ సీజన్ 4 విజేతకు కప్ అందజేసిన కార్పొరేషన్ చైర్మన్.

**సూర్య, కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని కొత్తబాద్ గ్రామంలో ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి మరియు తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మెన్ కాసుల బాల్ రాజ్ వారి సహకారంతో నిర్వహించిన కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ లో కొత్తబాద్, బాన్సువాడ జట్లు తలపడగా కొత్తబాధ్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ఫైనల్లో విజేతగా నిలవగా రన్నర్ అప్ గా బాన్సువాడ ఫిష్ మార్కెట్ టీం నిలిచింది. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., గ్రామీణ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని, గ్రామీణ స్థాయి క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రికెట్ టోర్నిలు ఎంతో దోహదపడతాయన్నారు. గెలుపు ఓటములు సమానంగా తీసుకుని క్రీడలో మున్ముందు జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అసద్ బిన్ మోసీన్, మాజీ ఎంపీపీ ఎజాస్, కామారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మధుసుధన్ రెడ్డి, సహాబ్, రాయిస్, రేంజర్ల సాయిలు, షోయెబ్, ప్రదీప్, సాయి రెడ్డి, సాయిలు, రఘు తదితరులు పాల్గొన్నారు.